# వానాకాలం సాగుపై రైతులకు శాస్త్రవేత్తల దిశానిర్దేశం

## ఎల్కుర్తిలో "రైతు ముంగిట శాస్త్రవేత్తలు" కార్యక్రమం





**ఎల్కుర్తి, /మే 23 (జర్నలిస్ట్ వార్త):** వానాకాలం సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో వ్యవసాయ కళాశాల, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "రైతు ముంగిట శాస్త్రవేత్తలు" అవగాహన కార్యక్రమంలో రైతులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ. శకుంతల దేవి మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని అధికంగా చేయడం వల్ల నేల సారవంతత దెబ్బతింటుందని తెలిపారు. అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, పంట మార్పిడి విధానం, సాగునీటి పొదుపు సాంకేతికతల ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రైతులకు వివరించారు.

వృక్ష వ్యాధి శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి కే. గోపిక మాట్లాడుతూ పంటలకు వచ్చే తెగుళ్ళు, ఆశించే పురుగుల నివారణకు జీవ నియంత్రణ పద్ధతులను వినియోగించాలని సూచించారు. రసాయనాల అధిక వినియోగం పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారి శ్రీ రాజేష్ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, నేల పరీక్షల ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. జనుము, జీలుగా విత్తనాల లభ్యతతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్. సుధాకర్, ఉపసర్పంచ్, వ్యవసాయ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు ఎ. మాధవి, కె. మౌనిక తదితరులు పాల్గొన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై శాస్త్రవేత్తలను సందేహాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు.

# బయ్యారం సోసైటీలో పచ్చిరొట్ట విత్తనాల పరిశీలన.

## -వ్యవసాయ అధికారి కే.రాజు.





**బయ్యారం/,మే 23.(జర్నలిస్ట్ వార్త)**మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ కేంద్రాన్ని శనివారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు సందర్శించారు.ఈ సందర్భంగా పచ్చిరొట్ట ఎరువు విత్తనాల నిల్వలు, పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. రైతులకు పంపిణీ చేయుటకు సిద్ధంగా ఉన్న 500 సంచుల జీలుగు విత్తనాలు రైతులకు పంపిణి చేయుటకు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా విత్తనాల నాణ్యతను నిర్ధారించుటకు ధైంచా విత్తనాల సర్వీస్ శాంపిల్స్ సేకరించి,వాటిని స్వచ్ఛత,తేమ శాతం,మొలక శాతం పరీక్షల నిమిత్తం వరంగల్ విత్తన పరీక్షా ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు.భూమి సారాన్ని పెంపొందించుటకు,సేంద్రియ కార్బన్ శాతాన్ని మెరుగుపరచుటకు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుటకు రైతులు జీలుగ పచ్చిరొట్ట ఎరువును వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సోసైటీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో జాప్యం వద్దు..!

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి -గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

### తల్లాడలో అధికారులతో అదనపు కలెక్టర్ డా. శ్రీజ సమీక్ష





**తల్లాడ, /మే 23 (జర్నలిస్ట్ వార్త):**

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డా. శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పెండింగ్ పనులను వేగవంతం చేసి కూలీలకు నిరంతర ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. ఉపాధి పనులకు సంబంధించిన ప్రతి ఫోటోను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించిన అదనపు కలెక్టర్, లబ్ధిదారులతో సమన్వయం పెంచి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "జల్ సంచయ్ జన్ భాగీదారి" పథకం లక్ష్యాలను వివరించిన ఆమె, జల సంరక్షణ నీటి పొదుపులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి వనరుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా, వేస్ట్ టు వెల్త్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫీల్డ్ విజిట్లు పెంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీధర్ రాజు, చలపతిరావు, మిషన్ భగీరథ (ఇంట్రా) ఏఈ సింధు, హౌసింగ్ ఏఈ అస్మా, ఏపీఎం రవికుమార్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# జమయిల్ తోటలో మంటలను అదుపులోకి తెచ్చిన సీఐ రవీందర్.



**బయ్యారం/,మే 23.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయ నగర్ కాలనీలో పల్లె దవాఖానాకు అనుకోని ఉన్న చల్లగుండ్ల వెంకటనారాయణ జమాయిల్ తోటకు నిప్పు అంటుకొని 2 ఎకరాలు జమాయిల్ తోట దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.గుర్తుతెలియని వ్యక్తులు మొక్కజొన్న పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న జమాయిల్ తోటకు మంటలు అంటుకోవడంతో స్థానికుల సమాచారం అందుకున్న గార్ల బయ్యారం సీఐ రవీందర్ హుటాహుటిన తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.అదేవిధంగా పెట్రోల్ బంక్ దగ్గర చింతల వెంకటనారాయణ మొక్కజొన్న చేనులో మంటలు వ్యాప్తి చెందడంతో హుటాహుటిన ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించి మంటలను అదుపులోకి తెచ్చి బంక్ దగ్గర పెనుప్రమాదం జరగకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించిన సీఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబును పలువురు అభినదించారు.ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యే పరమావధి

## ధాన్యం కేంద్రాన్ని ముంచేసిన మంటలు.. వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్




**వర్ధన్నపేట/మే 23(జర్నలిస్ట్ వార్త):**

సమస్య ఏదైనా, ఏ సమయంలో వచ్చినా సరే. ప్రజా సేవలో తానే ముందుంటానని వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మరోసారి నిరూపించుకున్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అకస్మాత్తుగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన 12వ డివిజన్ కౌన్సిలర్ తిరుపెల్లి వాణి కుమార్ స్వామి వెంటనే మున్సిపల్ చైర్మన్ సారంగపాణికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆ సమయంలో చైర్మన్ తన తల్లికి వైద్య పరీక్షల నిమిత్తం హనుమకొండ ఆసుపత్రిలో ఉన్నారు.వ్యక్తిగత సమస్య పక్కనపెట్టి.. రంగంలోకి దిగిన చైర్మన్. తన తల్లి ఆసుపత్రిలో ఉన్నప్పటికీ, సమాచారం అందిన వెంటనే స్పందించిన చైర్మన్ సారంగపాణి రైతుల ధాన్యాన్ని కాపాడడమే ధ్యేయంగా రంగంలోకి దిగారు. వర్ధన్నపేటలో స్థానికంగా ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో, ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి వరంగల్ నుండి ఫైర్ సిబ్బందిని ఘటనా స్థలానికి రప్పించారు.

### ఆసుపత్రి నుంచే సమన్వయం

వరంగల్ ఫైర్ సిబ్బంది ఎల్. వెంకన్న , జి. కుమారస్వామి , వై.ఎన్.ఎమ్. ప్రసాద్ ఎల్. కరుణాకర్, వజిత్ లకు కోనాపురం ధాన్యం కొనుగోలు కేంద్రం చిరునామాను ఆసుపత్రి నుంచే స్పష్టంగా వివరిస్తూ సకాలంలో అక్కడికి చేరుకునేలా చైర్మన్ మార్గదర్శనం చేశారు. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.






### రైతులు, ప్రజల హర్షం

సకాలంలో స్పందించి తమ కష్టాన్ని, ధాన్యాన్ని కాపాడిన చైర్మన్ సారంగపాణికి కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులు, హమాలీలు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా గంటల వ్యవధిలోనే పరిష్కరిస్తూ, ప్రజా సమస్యలను తన సొంత సమస్యలుగా భావించే ఇలాంటి నాయకుడు ఉండడం అదృష్టమని పట్టణ ప్రజలు చైర్మన్‌ను ప్రశంసలతో ముంచెత్తారు.

